క్లుప్తంగా

షార్ట్‌ఫిల్మ్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: సమాజహితం కోసం అనేక సందేశాత్మక చిత్రాలను నిర్మించిన మర్కు లక్ష్మణ్ దర్శకత్వంలో 'పేద కుటుంబం' అనే షార్ట్ ఫిల్మ్ చిత్రీకరించడం అభినందనీయమని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలో మంగళవారం షార్ట్‌ఫిల్మ్‌కు సంబంధించిన పోస్టర్‌ను నాయన ఆవిష్కరించారు. కెమెరా శ్రీకాంత్, జబర్దస్త్ కథ సుమల, నటులు పద్మ, రామస్వామి, అక్షిత్, రిక్కి, హరిబాబు, సాగర్ ఉన్నారు.

చలో కొత్తగూడెం జయప్రదం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గోదావరిఖని: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించనున్న సీపీఐ ప్రజాగర్జన బహిరంగసభ విజయవంతం చేయాలని నాయకులు కె.కనకరాజ్, ఎల్లాగౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గోసిక మోహన్, తాళ్లపల్లి మల్లయ్య, రంగు శ్రీనివాస్, ఎంఏ గౌస్, శనగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి కృషి


బీజేపీలో చేరుతున్న భాగ్యలక్ష్మి

పెద్దపల్లిరూరల్: పీఎం నరేంద్రమోదీ సారథ్యంలోని ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలానికి చెందిన మహిళా సంఘ అధ్యక్షురాలు మల్క భాగ్యలక్ష్మి మంగళవారం పార్టీలో చేరగా ఆయన కండువా అందించి స్వాగతించారు. నాయకులు మీస అర్జున్‌రావు తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలి

కాల్వశ్రీరాంపూర్: దళితబంధు పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబానికి వర్తింపజేయాలని ప్రభుత్వ మాజీ న్యాయవాది, మాజీ ఎంపీటీసీ మార కిషోర్ డిమాండ్ చేశాడు. కాల్వశ్రీరాంపూర్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళితులను ఓటు బ్యాంకుగా చూడకుండా వారి అభివృద్ధికి పాటుపడాలని కోరారు. చెవుల రాయమల్లు, రాజయ్య, ఉన్ని తిరుపతి, దాసరి రాంచంద్రం పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన


ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, తహసీల్దార్

జూలపల్లి: మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ రమాదేవి, తహసీల్దారు జయశ్రీ పరిశీలించారు. శతాబ్ది ఉత్సవాలపై ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తుండగా కొనుగోలు కేంద్రం సందర్శించాలని రైతులు ఆందోళన చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ లారీలు వెంటనే వచ్చేలా చర్యలు తీసుకుంటానని, హమాలీలు కొనుగోలు కేంద్రంలో తూకం వేసేలా ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ రమేశ్, సర్పంచ్ నర్సింహయాదవ్, ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్, రైతులు మల్లెత్తుల అంజి ఉన్నారు.

రైతుల అరెస్ట్ అన్యాయం

జూలపల్లి: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని అడిగినందుకు రైతులను అరెస్టు చేయించడం అన్యాయమని ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్ అన్నారు. మండల కేంద్రంలో శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై జరుగుతున్న సన్నాహక సమావేశానికి ఎంపీపీ రమాదేవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ హాజరయ్యారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని, కొనుగోలు కేంద్రానికి వచ్చి రైతుల ఇబ్బందులు చూడాలని కోరారు. సమావేశం తర్వాత వస్తామని చెప్పినా వినిపించుకోకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై వెంకటకృష్ణ రైతులను స్టేషన్‌కు తరలించారు. మిగతా రైతులు కూడా స్టేషన్‌కు వెళ్లడంతో ఎస్సై అందరినీ వదిలిపెట్టారు.

మూడేళ్లయినా.. ఎదురుచూపులే

- మహిళా సంఘ భవనాలు పూర్తయ్యేదెన్నడు?
- డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మాణం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


అసంపూర్తిగా మహిళా సంఘ భవన నిర్మాణం

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లోని స్వశక్తి సంఘాల మహిళలకు పక్కా భవనాలు నిర్మించేందుకు చేపట్టిన మహిళా సంఘ భవనాల నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. మహిళా సంఘాల మహిళలు సమావేశాలు, సందేహాలను నివృత్తి చేసుకొని ఆర్థికంగా ఎదగడానికి మహిళలకు పక్కా భవనాలు అవసరం అని ప్రజాప్రతినిధులను కోరారు. దీంతో సుల్తానాబాద్ మండలంలో సుగ్లాంపల్లి, ఐతరాజుపల్లి, నీరుకుల్ల, నారాయణరావుపల్లి, గర్రెపల్లి, తొగర్రాయి గ్రామాల్లో మహిళా సంఘ భవనాలు నిర్మించేందుకు మూడేళ్ల క్రితం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కానీ మూడేళ్లు గడిచినా.. అవి స్లాబ్ వరకే నిర్మాణం జరిగి అసంపూర్తిగా ఉన్నాయి. భవనాలు ఎప్పుడు పూర్తవుతాయా అని మహిళా సంఘాలు ఎదురుచూస్తున్నాయి.

మూడేళ్లు గడుస్తున్నా.. పట్టింపులేదు

సుల్తానాబాద్ మండలంలో డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫ్రండ్ ట్రస్ట్) కింద సుగ్లాంపల్లి, ఐతరాజుపల్లి, నీరుకుల్ల, నారాయణరావుపల్లి గ్రామాల్లో చేపట్టిన భవనాలకు ఒక్కో దానికి రూ.8లక్షల చొప్పున నిధులు కేటాయించారు. కాగా ఎస్‌డీఎఫ్ కింద రూ.5లక్షలతో గర్రెపల్లిలో, సీడీఎఫ్ నిధులు రూ.5లక్షలతో తొగర్రాయిలో చేపట్టగా ఒక్కటి కూడా పూర్తి కాలేదు. ఒక భూపతిపూర్‌లో మాత్రమే భవనం పూర్తి కాగా ప్రారంభించారు.

నిధుల కొరత..

గ్రామాల్లో చేపట్టిన మహిళా సంఘ భవనాలు అసంపూర్తిగా మిగలడానికి కారాణం అరకొర నిధుల కేటాయింపు అని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అంటున్నారు. ఒక్కో భవనం నిర్మాణ ఖర్చు ఎంత అని ముందస్తుగానే అంచనా వేసి నిధులు కేటాయిస్తారు. కానీ ఇక్కడ ఏదో స్వశక్తి సంఘాల మహిళల దృష్టిని ఆకర్షించేందుకు ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిధుల మేరకే నిర్మాణం చేపట్టి వదిలేశారు. ఇప్పటికైనా మహిళా సంఘ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని స్వశక్తి మహిళలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం



మహిళా సంఘ భవనాల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు మళ్లీ నిధులు కేటాయించేందుకు ఎమ్మెల్యే కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే పనులు పూర్తి చేస్తాం. – సతీశ్, పంచాయతీరాజ్ ఏఈఈ, సుల్తానాబాద్

నిర్మాణం పూర్తి చేయాలి

మహిళా సంఘ భవనాలను త్వరగతిన పూర్తి చేసి మహిళలకు అప్పగిస్తే సంఘ సమావేశాలు నిర్వహించుకుంటాం. సమావేశాల నిర్వహణకు ఇబందులు పడుతున్నాం. ఇప్పటికైనా భవనాల నిర్మాణం పూర్తి చేయాలి. – స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

పాలకుర్తి: సీఎం కేసీఆర్ ఆదేశానుసారం జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. పాలకుర్తి రైతువేదికలో మంగళవారం నిర్వహించిన 'దశాబ్ది ఉత్సవాల నిర్వహణ మండల స్థాయి సమీక్ష' సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని విభాగాల అధికారులు ప్రణాళికలు రూపొందించుకుని ప్రభుత్వం షెడ్యూల్ ప్రకారం దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా అటవీశాఖ అధికారి శివయ్య, ఎంపీపీ అనసూర్య, ఎంపీడీవో లలిత, తహసీల్దార్ సునీత, జెడ్పీటీసీ సంధ్యారాణి, ఏవో ప్రకాశ్, ట్రాన్స్‌కో ఏఈ వంశీకృష్ణ, ఐకేపీ ఏపీఎం సదానందం పాల్గొన్నారు.

ఎంపీడీవోపై జెడ్పీటీసీ అసహనం..

పాలకుర్తి రైతువేదికలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో లలితపై పాలకుర్తి జెడ్పీటీసీ సంధ్యారాణి అసహనం వ్యక్తం చేశారు. సమావేశం ముగింపు సమయంలో వచ్చిన జెడ్పీటీసీ మాట్లాడాల్సిందిగా కోరడంతో పాటు తమకు జిల్లా స్థాయి మీటింగ్ ఉన్నందున తొందరగా పూర్తి చేయాలని ఎంపీడీవో అనడంపై జెడ్పీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు.


పెద్దపల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ స్రవంతి

పెద్దపల్లి మండలంలో..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని మండల ప్రత్యేకాధికారి మైఖేల్ బోస్, ఎంపీపీ బండారి స్రవంతి అన్నారు. జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్, విండో చైర్మన్ నర్సింహారెడ్డి, తహసీల్దార్ వెంకటలక్ష్మి ఉన్నారు.

కమాన్‌పూర్: ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల ప్రత్యేక అధికారి రహుఫ్‌ఖాన్, ఎంపీపీ రాసకొండ లక్ష్మి, ఏఎంసీ, పీఏసీఎస్ చైర్మన్లు దాసరి రాయలింగు, ఇనగంటి భాస్కర్‌రావు, ఎంపీడీవో విజయ్‌కుమార్, తహసీల్దార్ దత్తు ప్రసాదరావు, ఎస్సై షేక్‌మస్తాన్ పాల్గొన్నారు.

రామగిరి మండలంలో..

రామగిరి మండలం రత్నాపూర్ రైతు వేదికలో సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి సాయినాథ్, ఎంపీపీ ఆరెల్లి దేవక్క, జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద, ఎంపీడీవో రమేశ్, తహసీల్దార్ రామ్మోహన్, ఎస్సై రవిప్రసాద్ పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలకేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తానిపర్తి స్రవంతి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, మండల ప్రత్యేక అధికారి తిరుపతిరావు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఇరిగేషన్ డీఈ, తహసీల్దార్ నాగరాజమ్మ, విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏపీఎం సుధాకర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకళ పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ బాలాజీరావు, మండల స్పెషల్ అధికారి నారాయణ, ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ యాకన్న, ఎస్సారెస్పీ డీఈ మాధుమతి, అగ్రికల్చర్ ఏడీ కాంతరావు, మెడికల్ అధికారి మధుకర్‌రెడ్డి, ఎంపీవో ఫయాజ్ అలీ పాల్గొన్నారు.

ఓదెల: మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో మండల ప్రత్యేక అధికారి జగన్మోహన్‌రెడ్డి సమీక్ష సమావేశం జరిగింది. ఎంపీడీవో జి.సత్తయ్య, ఇరిగేషన్ శాఖ డీఈఈ భాస్కర్, ఏడీఏ శ్రీనాథ్, ఏఈఈ సమ్మిరెడ్డి, ఎంపీవో వాజిద్ పాల్గొన్నారు.

శ్రీభక్తమార్కండేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో పద్మశాలీల ఆధ్వర్యంలో శ్రీభక్తమార్కండేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో సర్పంచ్ ఆడెపు శ్రీదేవి, ఏఎంసీ డైరెక్టర్ సబ్బని రాజమల్లు, మాజీ సర్పంచ్ గూట్ల రాజమౌళి, ఉత్సవ కమిటీ నాయకులు రాజయ్య, రాజు, శ్రీనివాస్, గోలి రంగయ్య, సత్యనారాయణ, ఆంజనేయులు, కృష్ణమూర్తి, కేశవులు, తిరుపతి, కుమార్, రమణయ్య, సంపత్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


మహోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

డాక్టరేట్ అవార్డు గ్రహీతకు సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ: తమిళనాడులో హుసూర్ పట్టణంలో గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్న సింగరేణి ఉద్యోగి జక్కుల దామోదర్‌రావును మంగళవారం ఆర్జీ–3 జీఎం చాంబర్‌లో జీఎం టీపీరావు, ఆర్జీ–2 జీఎం మనోహర్‌రావు, ఏఎల్‌పీ జీఎం వెంకటేశ్వర్లు సన్మానించారు. పీవోఎస్ రాధాకృష్ణ, ఆర్జీ–3, ఏఎల్‌పీ టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు గౌతమ్, శంకరయ్య, నాయకులు అంకుస్, సెస్టోబాల్ ప్రతినిధులు ఓదెలు యాదవ్, సత్యం పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ధర్మారం: ధర్మారం మండలం నర్సింగపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామ మహిళా రైతులు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. గ్రామ శివారులోని సర్వే నెంబర్ 215, 227, 273లోని ప్రభుత్వ భూమిని కొందరు అక్రమంగా సాగు చేసుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా కొంతమంది రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆన్‌లైన్ పట్టాలు పొందారని తెలిపారు. అక్రమంగా కబ్జా చేసుకుంటున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పెద్దాపూర్‌లో పౌరహక్కుల దినోత్సవం

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో పౌరహక్కుల దినోత్సవాన్ని తహసీల్దారు జయశ్రీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంకణాల భారతి, ఏఎన్‌ఎం రుక్మిణి, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ధూళికట్టలో వైభవంగా జోగెత్తడం

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో కుర్మ, యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీరన్న పట్నాల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బీరన్న ఉత్సవ విగ్రహంతో జోగెత్తడం వైభవంగా నిర్వహించారు. రాత్రి బీరన్న నాగవెల్లి బోనాలను కుర్మ, యాదవ కుటుంబాల నుంచి ఇంటికో బోనం చొప్పున మహిళలు బోనాలు ను ఎత్తకుని ఆలయానికి తరలివెళ్లారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొండ తిరుపతియాదవ్, మాజీ ఎంపీటీసీ కొమురయ్య, మాజీ ఉపసర్పంచ్ చంద్రయ్య పాల్గొన్నారు.

✦కాలనీ సందర్శన

మంథని: మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌పురను మున్సిపల్ చైర్‌పర్సన్ మంగళవారం సందర్శించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని నాలుగు రోజుల క్రితం కాలనీ మహిళలు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ మేరకు కాలనీని సందర్శించిన చైర్‌పర్సన్ సమస్య పరిష్కారానికి చొరవ చూపారు.

✦నేడు ఆటల పోటీలు

గోదావరిఖని: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 31న ఉదయం 9గంటలకు యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ క్లబ్‌లో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

✦ఒకరి బైండోవర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం మారేడుగొండ పంచాయతీ పరిధి దావన్నపల్లికి చెందిన కందునూరి మహేందర్‌ను మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

✦రైతు మహాధర్నాకు తరలిన బీజేపీ శ్రేణులు

ఎలిగేడు: బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని రైతు మహాధర్నా, కలెక్టరేట్ ముట్టడికి ఎలిగేడు మండలం నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు మామిడాల రమేశ్, గర్రెపల్లి నారాయణస్వామి, గాదె రంజిత్‌రెడ్డి, ఇల్లందుల పరశురాములు, అమరగొండ గంగయ్య ఉన్నారు.

✦కరెంట్ షాక్‌తో మేక మృతి

ధర్మారం: మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన మారం అయిలయ్యకు చెందిన మేక మంగళవారం మేతకు వెళ్లి కరెంట్ షాక్‌తో మృతి చెందింది. గ్రామ శివారులోని పత్తిగుట్టకు అయిలయ్య మేకలను మేత కోసం తీసుకెళ్లగా ప్రమాదవశాత్తు తెగిపడిన విద్యుత్ వైర్ షాక్ తగలడంతో మేక అక్కడికక్కడే మృతిచెందింది.

✦ఆర్థికసాయం అందజేత

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరెల్ల తిరుపతి కూతురు నిక్షిత వివాహానికి కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మన్ పంపించిన రూ.5వేలు మంగళవారం సుల్తానాబాద్ కౌన్సిలర్ అనుమాల బాపురావు, కేసీఆర్ సేవాదళం జిల్లా ఉపాధ్యక్షుడు బింగి రాజు ద్వారా అందజేశారు. కేసీఆర్ సేవాదళం గ్రామశాఖ అధ్యక్షుడు ముత్యం దేవయ్య, నాయకులు పాల్గొన్నారు.

ధూళికట్టలో 154మందికి కంటి పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం 154మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 13మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కావేరి, ఎంపీటీసీ సావిత్రమ్మ, మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా, క్యాంపు మెడికల్ ఆఫీసర్ స్వప్న, కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం

పాలకుర్తి: పాలకుర్తి మండలంలో మంగళవారం ఉదయం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం నిల్వలతో పాటు తూకం వేసిన ధాన్యం బస్తాలు తడిసిపోయాయి.


బసంత్‌నగర్ కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు

ఓదెలలో తడిసిన ధాన్యం

ఓదెల: మండలంలో ఓదెల, గుంపుల, పొత్కపల్లి, కొలనూర్, కనగర్తి గ్రామాల్లో కురిసిన వర్షానికి ఐకేపీ సెంటర్లలో ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది. ఓదెలలో ప్రభుత్వ కార్యాలయాల ఎదుట 11కేవీ విద్యుత్ స్తంభం విరిగింది.

కొనుగోలు కేంద్రాల సందర్శన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలో మంగళవారం కురిసిన అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు తడిశాయి. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కేంద్రాలను సందర్శించి తడిసిన ధాన్యం పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. కేంద్రాల్లో ధాన్యం తూకం వేయడంలో జరుగుతున్న జాప్యం, లారీలు రాకపోవడంతో సకాలంలో మిల్లుకు పంపించకపోవడం తదితర సమస్యలను రైతులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే కేంద్రాల్లోని ధాన్యానికి సత్వరమే తూకం వేసి మిల్లులకు పంపించాలని అధికారులను ఆదేశించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామంలోని లబ్ధిదారులకు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మంగళవారం నేరుగా ఇంటికి కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. సర్పంచులు బాదరవేణి స్వామి, గుమ్ముల రవీందర్, ప్రవీణ్‌కుమార్, ధర్ని రాజేశ్, ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెరుమాళ్ల శశికుమార్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోల సంతోష్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు నువ్వుల సంతోష్, ఎలుక కొమురయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

పాలకుర్తి: రైతులు పండించిన పంటను మిల్లర్లు తరుగు, తాలు పేరిట కోతలు విధిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని పాలకుర్తి వరిధాన్యం కొనుగోలు కేంద్రం రైతులు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు రైతులు తమ ఇబ్బందుల గురించి వివరించారు. తాను 500 బస్తాల ధాన్యం కొనుగోలు కేంద్రంలో అమ్మితే 43బస్తాలు కోత విధించారని పాలకుర్తి గ్రామ రైతు మాదాసు కనుకయ్య ఎమ్మెల్యేకు వివరించాచారు. స్పందించిన ఎమ్మెల్యే జిల్లా పౌరసరఫరాల శాఖాధికారితో ఫోన్లో మాట్లాడారు. మిల్లర్లతో చర్చించి రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఘనంగా శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న రాజ్‌ఠాకూర్


సుల్తానాబాద్‌లో సంబరాలు

గోదావరిఖని/సుల్తానాబాద్: మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను మంగళవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. గోదావరిఖనిలోని ప్రధాన చౌరస్తాలో మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కేక్‌కట్ చేసి అన్నదానం చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. సుల్తానాబాద్‌లో నెహ్రూ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు కేక్ కట్ చేశారు. జిల్లా కేంద్రం, ధర్మారం, జూలపల్లి, ఎలిగేడు, ఓదెల, పాలకుర్తి, రామగుండం మండలాల్లో శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ప్రధాన రహదారిపై నిలిచిన వరద నీరు

- 100 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనుల తీరుపై విమర్శలు
- నిలిచిన నీళ్లలో మొక్కలు నాటి డీవైఎఫ్ఐ నాయకుల నిరసన

కోల్‌సిటీ: గోదావరిఖని గాంధీనగర్‌లోని 100 ఫీట్ల ప్రధాన రహదారిపై మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి వరద నీరు భారీగా నిలిచింది. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి స్థానిక ఫైవింక్లయిన్ చౌరస్తా వరకు నిర్మిస్తున్న 100 ఫీట్ల రోడ్డు పనులు అస్తవ్యస్తంగా మారాయి. వర్షం కురిసినప్పుడల్లా చెరువును తలపించేలా వరద నీరు రోడ్డుపై నిలుస్తుంది. దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రహదారిపై భారీగా నిలిచిన వరదనీటిపై మంగళవారం డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కొంటు సాగర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతూ నిరసన తెలిపారు. రహదారి నిర్మాణంలో మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే రోడ్డు నిర్మాణం అస్తవ్యస్తంగా చేపట్టారని ఆరోపించారు. చిన్నపాటి వర్షానికే చెరువును తలపించేలా వరద నీరు నిలుస్తోందని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజకుమార్, కృష్ణకుమార్ పాల్గొన్నారు.


నిలిచిన వరద నీటిలో మొక్కలు నాటుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

అంబేడ్కర్ సేవ యువజన సంఘం కమిటీ ఎన్నిక

సుల్తానాబాద్: అంబేడ్కర్ సేవ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడిగా పట్టణంలోని మార్కండేయ కాలనీకి చెందిన పల్లె శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీలో యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తిప్పారపు దయాకర్ ఆధ్వర్యంలో మంగళవారం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా భూష్వాక సుమన్, ఉపాధ్యక్షులు న్యాతరి రాజేందర్, రుద్రారపు రాజయ్య, పల్లె వినయ్, సహాయ కార్యదర్శిగా పాల రాజు, ఖమ్మంపల్లి శ్రీనివాస్, గొర్రె రమేశ్, కోశాధికారి కల్వల రాయనర్సు, ప్రచార కార్యదర్శి కల్లపల్లి మహేశ్, వద్లూరి మహేశ్, కార్యవర్గ సభ్యులుగా పోగుల తిరుపతి, గుడిసెల మల్లేశ్, పొత్తూరి రవిని తెలిపారు. యాదాసి కోశాలు, చిలుక రాజేశం, తిప్పారపు దివాకర్, నేతరి మహేందర్ తదితరులు ఉన్నారు.


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

చెత్త వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలి

జ్యోతినగర్: ప్రజలు ఇళ్లలోని చెత్తను ఇష్టానుసారంగా ఆ బయట పడేయకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి అందించాలని కార్పొరేటర్ ఎన్వీ రమణారెడ్డి కోరారు. అన్నపూర్ణకాలనీలో మంగళవారం ఆర్ఆర్ఆర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెత్తను అట్టలు, ఇనుప సామాను, ప్లాస్టిక్, గాజు వస్తువులను వేరుగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు అధికారులు శంకర్, వసంతరావు, జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సంపత్, పద్మావతి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ రమణారెడ్డి

డ్రైవర్లకు ఉచిత వ్యక్తిగత ప్రమాద బీమా

మంథని: మండలంలోని వాహన డ్రైవర్లకు ఉచితంగా వ్యక్తిగత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు బీజేపీ నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి తెలిపారు. మంథనిలోని మహాలక్ష్మి గార్డెన్‌లో బుధవారం ప్రత్యేకంగా సమావేశమై ప్రమాద బీమా పాలసీ అందిస్తామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లాలపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి

ఎలిగేడు: మండలంలోని లాలపల్లికి కొన్నిరోజుల నుంచి బస్సు సౌకర్యం నిలిపివేశారని, తిరిగి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామానికి చెందిన గుర్రం మల్లారెడ్డి కరీంనగర్–2 డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. బస్సు నిలిపివేయడంతో మండలంలోని ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, లాలపల్లి గ్రామం రాజీవ్ రహదారికి 10కిలోమీటర్ల దూరంలో ఉండడంతో గ్రామం నుంచి పట్టణాలకు వెళ్లే వారికి ఇబ్బందులు తప్పడంలేదని వాపోయారు.